సాయినామ స్మరణలో..

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

గురుపౌర్ణమి పురస్కరించుకుని సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లోని ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం బాబాను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఊరేగించారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని పలు విద్యా సంస్థల్లో గురువులను సన్మానించారు. బాపునగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోని సాయిబాబాను మంత్రి తలసాని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

– సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్


హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలో..


పూజలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీలత


పూజలో పాల్గొన్న ఆలయ చైర్మన్ ప్రకాశరావు


సాయిబాబాను దర్శించుకుంటున్న మంత్రి తలసాని


పూజలు నిర్వహిస్తున్న నాగులూరి సాయిబాబా


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఇంద్రన్న


పూజలో పాల్గొన్న లాస్య నందిత, నివేదిత


సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు


పూజలో పాల్గొన్న సీఈఓ మధుకర్ నాయక్


మాట్లాడుతున్న సద్గురు డాక్టర్ సాయిబాబా


హనుమాన్ దేవాలయంలో మర్రి రాజశేఖర్ రెడ్డి


బోయిన్‌పల్లి ఆలయంలో పూజల్లో పాల్గొన్న జక్కుల మహేశ్వర్‌రెడ్డి

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట, ఆల్విన్, ఎర్రమంజిల్, కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాపునగర్, ఎస్‌ఆర్‌నగర్ మెయిన్ రోడ్డు, లోయర్ వాటర్ వర్క్స్ కార్యాలయం, 2ఆర్‌టీ క్వార్టర్స్, సౌభాగ్యనగర్, ఎస్‌ఆర్‌టీ క్వార్టర్స్, కైలాష్‌నగర్, సుభాష్‌నగర్.
- మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పంజగుట్ట, గణేష్ టెంపుల్, జిక్రా స్కూల్, ప్రతుల్ హోండా ఏరియా, దుర్గానగర్, సూర్యనగర్, అమృత మాల్, జీఎస్ మాల్, ఐసీఐసీఐ బ్యాంక్, జయగార్డెన్, ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు, ఎఫ్‌సీఐ గోదాం, ప్రేమ్‌నగర్, ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలన్నారు.

జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా నీరుడు కృష్ణ


నియామకపత్రం అందుకుంటున్న కృష్ణ

బౌద్ధనగర్: కార్పొరేట్ విద్య నియంత్రణ జేఏసీ తెలంగాణ స్టేట్ సెక్రటరీగా నీరుడు కృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జస్టిస్ బి. చంద్రకుమార్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఇచ్చిన పదవి పట్ల అంకితభావంతో పని చేస్తానని నీరుడు కృష్ణ పేర్కొన్నారు. రాష్ట్ర చైర్మన్ చెన్నోజు శ్రీనివాస్, వెంకటేష్, యోగేష్, వెంకటేష్ గౌడ్, రవి నాయక్, మదన్ మోహన్, విజయ్ నాయక్, రమేష్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుండెపోటుతో మహిళ మృతి


స్వప్న

సికింద్రాబాద్: గుండెపోటుతో ఓ మహిళ మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. భద్రాది కొత్తగూడెం జిల్లా సీతారామపట్నం గ్రామానికి చెందిన కే.స్వప్న(35) ఊరికి వెళ్లేందుకు సోమవారం తన కుమారుడితో కలిసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చింది. మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైలు కోసం ప్లాట్ ఫాం నెం.3లోని ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద వేచి చూస్తున్న క్రమంలో స్వప్నకు హఠాత్తుగా ఛాతీలో నొప్పి వచ్చింది. గమనించిన స్థానికులు పక్కనే ఉన్న బెంచీపై పడుకోబెట్టగా కొద్ది సేపటికే మృతి చెందింది.

ముగిసిన టీమ్‌సాయి ఉత్సవ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

రసూల్‌పురా: తిరుమలగిరి ఫుట్‌బాల్ మైదానంలో టీమ్‌సాయి ఉత్సవ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఫైనల్‌లో విజేతగా బ్రాలర్స్ ఎఫ్‌సీ జట్టు, రన్నరఫ్‌గా ఫ్రెండ్స్ యునైటెడ్ క్లబ్ జట్టు నిలిచాయి. సోమవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో జీఎస్‌ఆర్ హాస్పిటల్ ఎండీ జి.నరేందర్ రెడ్డి, నిర్మల యోగా డ్యాన్స్ సెంటర్ నిర్వాహకులు నిర్మల ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టీమ్‌సాయి ఉత్సవ్ పేరుతో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. హన్మంతరావు, పరశురాం, గోపు రమణారెడ్డి, రజిని, విజయానంద్, లావణ్య, ప్రకాష్ చౌదరి, సుజాత, పద్మిని అజిత్ పాల్గొన్నారు.

విశ్వకర్మ సంఘం బైలాస్‌లో మార్పులు అవసరం

రాంగోపాల్‌పేట్: విశ్వకర్మ సంఘం బైలాస్‌లో కాలానుగుణంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉందని సంఘం కార్యవర్గ సభ్యులు తీర్మానంచేశారు. సోమవారం సికింద్రాబాద్ విశ్వకర్మ సంఘం భవనంలో నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో హైకోర్టు న్యాయవాది పాలాసగిరి కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు గోపాలపురం ప్రకాష్, ప్రధాన కార్యదర్శి భాస్కరాచారి గతేడాది జరిగిన అభివృద్ధి, సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చక్రపాణి, వీరాచారి, దుబ్బాక కిషన్‌రావు, వెంకటేశం, బాలాచారి, రమణాచారి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

సికింద్రాబాద్: అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ యువకుడికి వైద్య ఖర్చుల నిమిత్తం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నోముల ప్రకాష్‌రావు ఆర్థిక సాయం అందజేశారు. అడ్డగుట్టకు చెందిన దేవరాజ్ అనే యువకుడు కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ సిటీ కన్వీనర్ లలిత ఈ విషయాన్ని నోముల ప్రకాష్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన దేవరాజ్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 20 వేల ఆర్థిక సాయం అందజేశారు.

బోనాల జాతర విజయవంతం చేద్దాం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రమేష్

రాంగోపాల్‌పేట్: అందరూ కలిసి ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర విజయవంతం చేద్దామని మహంకాళి డివిజన్ ఏసీపీ రమేష్ కోరారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ కావేటి శ్రీనివాస్, అధికారులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. భక్తులు, ఫలహార బండ్ల ఊరేగింపు నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దేవాదాయ శాఖ అధికారులు అందరూ కలిసి అమ్మవారి జాతర ప్రశాంతంగా పూర్తిచేసేందుకు సహకరించాలన్నారు. దేవాలయ పరిసర ప్రాంతాల్లో 114 సీసీ కెమెరాలు, దేవాలయంలో 20, ఎల్ అండ్‌టీకి చెందిన మరో 20 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని దుకాణాల ముందున్న సీసీ కెమెరాలు పని చేసేలా ఉంచుకోవాలని సూచించామన్నారు. బోనాలతో వచ్చే మహిళలకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశామని, బంగారు ఆభరణాలతో వచ్చే మహిళలు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. శివసత్తులకు 2 గంటల నుంచి 4 గంటల వరకు అనుమతిచ్చామని వాళ్ల బ్యాండు మేళాలతో కమాన్ వరకు రావొచ్చని చెప్పారు. సుమారు రెండు మంది పోలీసు అధికారులతో పాటు మహిళా సిబ్బంది తదితర సాయుధ బలగాలను జాతర కోసం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ధర్నా పోస్టర్ ఆవిష్కరణ


ధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

చిలకలగూడ : అర్హులకు డబుల్ బెడ్రూమ్, గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వాలనే డిమాండ్‌తో ఈ నెల 6న ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్ తెలిపారు. చిలకలగూడ గాంధీ చౌక్ వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలపై అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమని, తక్షణమే కేసులు ఎత్తివేసి పట్టాలు పంపిణీ చేయాలన్నారు. జీవో నంబరు 58 ప్రకారం మౌలిక వసతులు కల్పించి క్రమబద్ధీకరించాలని, గృహలక్ష్మీ పథకం ద్వారా రూ. 5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెద్ద సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమురెల్లి బాబు, సోమయ్య, యాదగిరి, షేక్‌మహ్మద్, రాములు, ఖాసీం, శ్రీహరి, గడ్డంయాదగిరి, కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న శ్రీలతా శోభన్‌రెడ్డి

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను సోమవారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. తార్నాక కిమ్తీ కాలనీలో లైబ్రరీ భవనం, లాలాపేటలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, స్విమ్మింగ్‌పూల్ నిర్మాణ పనుల వివరాలపై ఆరా తీసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం నూతనంగా ప్రారంభమైన తార్నాక వార్డు కార్యాలయాన్ని సందర్శించి అక్కడ విధుల్లో ఉన్న అధికారులతో మాట్లాడారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డు కార్యాలయంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

సికింద్రాబాద్: డివిజన్‌లోని బీ–సెక్షన్, నార్త్‌లాలాగూడలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం అధికారులతో కలిసి బీఆర్‌ఎస్ నేతలు పరిశీలించారు. పలువురు మాట్లాడుతూ.. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. జలమండలి మేనేజర్ కృష్ణ ప్రసాద్, జీహెచ్ఎంసీ ఏఈ వేణు, నేతలు లింగాని శ్రీనివాస్, పొన్నాల రాజు, అమర్, ఇస్మాయిల్, గోపి, మహేందర్ పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలకు బెస్ట్ ఇనిస్టిట్యూషన్ ట్రోఫీ


శిల్పవల్లికి ట్రోఫీని అందిస్తున్న అధికారులు

సనత్‌నగర్: బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు ఎన్‌సీసీ విభాగంలో బెస్ట్ ఇనిస్టిట్యూషన్ ట్రోఫీ లభించింది. అత్యుత్తమ ప్రదర్శన, నిబద్ధత, అంకితభావంతో సేవలు అందించినందుకు ఏడో తెలంగాణ గరల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి సమక్షంలో ఎన్‌సీసీ ఆఫీసర్ శిల్పవల్లికి బెటాలియన్ అధికారులు ట్రోఫీతో పాటు ప్రశంసాపత్రం అందించారు. తమ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఉత్తమ సేవలకు గానూ అవార్డు అందుకోవడం ఎంతో గర్వంగా ఉందని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో ఎన్‌సీసీ మరింత బాధ్యతాయుతంగా సేవలందించేలా కృషి చేస్తామన్నారు.

సిక్‌వాలా సమాజ్‌లో గురుపూర్ణిమ ఉత్సవాలు


ర్యాలీని ప్రారంభిస్తున్న కోశికె కిరణ్మయి

రాంగోపాల్‌పేట్: సిక్‌వాలా సమాజ్ ఆధ్వర్యంలో సోమవారం రంగ్రేజీ బజార్‌లోని సమాజ్‌లో నిర్వహించిన గురుపూర్ణిమ ఉత్సవాలను మాజీ కార్పొరేటర్లు కోశికె కిరణ్మయి, అత్తెల్లి అరుణగౌడ్ ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేయడంతో పాటు గురువులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రంగ్రేజీబజార్ నుంచి సుభాష్‌రోడ్ తదితర ప్రాంతాల గుండా భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాజ్ అధ్యక్షులు విజయ్ ఉపాధ్యాయ, ఉపాధ్యక్షులు రాజేష్ వ్యాస్, తులసీరాం వ్యాస్, రాకేష్ వ్యాస్, కిషోర్ ఉపాధ్యాయ, గజ్జుబాయ్ కొలారియా పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు



కంటోన్మెంట్: దశల వారీగా కంటోన్మెంట్ పరిధిలోని అన్ని కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. ఆరో వార్డు బాలాజీ ఎన్‌క్లేవ్‌లో రూ.6 లక్షల బోర్డు నిధులతో చేపట్టిన డ్రైనేజీ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కంటోన్మెంట్‌లో అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేదన్నారు. ఈ నేపథ్యంలో బోర్డు పరిధిలో అందుబాటులో ఉన్న పరిమిత నిధులతో దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. మల్లికార్జున్, పరుశరామ్, శ్రీనివాస్ రెడ్డి, శ్యామ్, రాజేష్, జితేందర్ సింగ్, అజయ్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల దొంగ రిమాండ్

- 11 ఫోన్లు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ రవి

లాలాపేట: సెల్‌ఫోన్లను దొంగిలిస్తున్న ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవి వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా కొడంగల్ భాయా తండాకు చెందిన ముడావత్ శంకర్ (25) బతుకుదెరువుకోసం నగరానికి వచ్చి అంబర్‌పేటలో ఉంటున్నాడు. కొంత కాలం ఆటో డ్రైవర్, మరికొంతకాలంగా కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన శంకర్ సెల్‌ఫోన్ల దొంగతనం చేయడం ప్రారంభించాడు. సెల్‌ఫోన్ దొంగతనం కేసులో 2013లో సరూర్‌నగర్ పీఎస్, 2017లో మలక్‌పేట పీఎస్ పరిధిలో అరెస్టయ్యాడు. ఈ నెల 3న ఉదయం తార్నాక ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో మఫ్టీలో ఉన్న పోలీసులు పట్టుకుని వివరాలు అడగగా సరైన సమాధానం ఇవ్వలేదు. అతని వద్ద ఉన్న బ్యాగులో తనిఖీ చేయగా వివిధ కంపెనీలకు చెందిన 11 సెల్‌ఫోన్లు ఉన్నాయి. స్టేషన్‌కు తీసుకెళ్లి తమదైన శైలిలో విచారించగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించామన్నారు.

రైలు ఎక్కుతుండగా జారిపడి యువకుడి మృతి



సికింద్రాబాద్: రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. బెలగాం వెళ్లేందుకు సోమవారం ఉదయం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు సుమారు 30 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని యువకుడు వచ్చాడు. 10.30 సమయంలో రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి ప్లాట్ ఫాం–రైలుకు మధ్యలో ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే రైల్వే పోలీసులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు రెడ్ కలర్ ఫుల్‌హ్యాండ్స్ షర్ట్, నలుపు రంగు ట్రాక్ ప్యాంట్, ఎడమ చాతిపై 'మను' అని ఇంగ్లిష్‌లో టాటూ ఉన్నట్లు తెలిపారు.

వాహనం ఢీకొని మహిళకు గాయాలు

లాలాపేట: వేగంగా వచ్చిన రెడీమిక్స్ వాహనం ఢీకొని ఓ మహిళకు గాయాలైన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై నరేష్ వివరాల ప్రకారం.. మెట్టుగూడ ప్రాంతానికి చెందిన మద్యాల ఆరతి (21) సికింద్రాబాద్‌లోని ఓ వస్త్రాల దుకాణంలో పని చేస్తుంది. గత నెల జూన్ 26న మెట్టుగూడ నుంచి మెట్రోలో తార్నాకకు వచ్చి తన పాప కోసం పాల డబ్బా కొని తిరిగి ఇంటికి నడుచుకుంటూ వస్తుంది. అదే సమయంలో అటుగా వచ్చిన ఓ ద్విచక్ర వాహనదారుడిని లిఫ్ట్ అడిగి వెళ్తున్నారు. తార్నాకలోని సుదర్శన్‌రెడ్డి స్వీట్ హౌజ్ వద్దకు రాగానే కాంక్రీట్ మిక్సర్ వాహనం టీఎస్(07యూకే5309) ర్యాష్‌గా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు కిందపడగా ఆరతికి కడుపు, తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో వ్యక్తి మృతి

సికింద్రాబాద్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన శివ కోటేశ్వర్‌రావు (38) వారం రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్న తన సోదరి ఇంటికి వచ్చాడు. రెండ్రోజుల క్రితం తిరిగి ఊరికి వెళ్తానని చెప్పి తన సోదరి వద్ద నుంచి కొన్ని డబ్బులు తీసుకొని ఇంటికి వెళ్లకుండా మద్యం తాగి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్నాడు. ఈ నెల 2న రాత్రి 11.30 గంటల సమయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నెం.1లో అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. గమనించిన పోలీసులు పరిశీలించగా మృతి చెంది ఉన్నాడు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ ఘటం ఊరేగింపు


ఎల్లమ్మ ఘటం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

చిలకలగూడ : చిలకలగూడ నాగులూరివీధిలో వరిగంటి ఎల్లమ్మ ఘటం ఊరేగింపు, వడిబియ్యం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలతో బయలుదేరిన ఎల్లమ్మ ఘటానికి స్థానికులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు బండ చంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పూజలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు తమవంతు కృషి చేస్తామని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. వరిగంటి ఎల్లమ్మ ఘటం ఊరేగింపు, వడిబియ్యం, బోనాలను గత మూడున్నర దశాబ్దాలుగా ప్రతిఏటా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసగౌడ్, ప్రభుగుప్తా, మహేష్, కాసరబాద వెంకటేష్, వీరన్న, పోతరాజుశ్రీను పాల్గొన్నారు.

బీసీ ముఖ్యమంత్రి సాధన కోసం ఐక్య కార్యచరణ

లాలాపేట: వచ్చే ఎన్నికల్లో బీసీని ముఖ్యమంత్రి చేయడానికి ఐక్య కార్యచరణతో ముందుకు వెళ్తున్నట్లు సదరన్ పొలిటికల్ అకాడమీ అధ్యక్షులు ప్రొ. గాలి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు మెజార్టీ కులాలకు చెందిన బీసీని సీఎం అభ్యర్థిగా ప్రకటించకుండా కేవలం బీసీ డిక్లరేషన్ పేరుతో మోసం చేస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్యం అంటే మెజార్టీ రూలింగ్ అని తెలంగాణలో మైనార్టీ కులమే పాలన చేస్తుందని ఈ పరిస్థితి మారాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. సెప్టెంబర్ 19న వరంగల్‌లో బీసీ సీఎం సాధన సదస్సు ఉంటుందని తెలిపారు.

విద్యార్థులకు రాత పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

రసూల్‌పురా: రోటరీ క్లబ్ ఆఫ్ సెంటినియల్ ఆధ్వర్యంలో మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం రాతపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన క్లబ్ ప్రతినిధి రామ్‌రాజ్ మాట్లాడుతూ.. తాను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకునే రోజుల్లో స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా పుస్తకాలు అందజేయడంతో ఉన్నత చదువులు చదివానని ఆ విషయాన్ని గుర్తు చేసుకుంటూ తాను కూడా పేద విద్యార్థులకు సేవ చేయాలనే ఆలోచనతో ప్రతి ఏడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రాత పుస్తకాలు అందజేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఆశీర్వాదం, రోటరీ క్లబ్ సభ్యులు అనిల్ దండు, ఉపాధ్యాయులు షడ్రక్, సునితా కుమారి, ఇందిరా, శ్రీలత, హేమలత పాల్గొన్నారు.

'వార్డు' సేవలను సద్వినియోగం చేసుకోవాలి


వార్డు కార్యాలయాన్ని సందర్శించిన కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: వార్డు కార్యాలయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ సూచించారు. నామాలగుండులో నూతనంగా ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని సోమవారం ఆమె సందర్శించి అధికారుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హేమ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు వార్డు కార్యాలయాల్లో అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. సమస్యపై వార్డు కార్యాలయంలో ఫిర్యాదు చేసిన పౌరుడికి ఫోన్ చేసి సమస్య పరిష్కారం అయిందా లేదా అని అడిగి తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అసిస్టెంట్ మున్సిపల్ ఆఫీసర్ సంధ్యారాణి, ఈఈ అశలత, డీఈఈ సువర్ణ, యూసీడీ అధికారిణి ధనుశ్రీ, ఏఈ కౌశిక్ పాల్గొన్నారు.

బౌద్ధనగర్‌లో ఇంటింటికీ బీజేపీ



బౌద్ధనగర్: సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం బీజేపీ నాయకులు డివిజన్‌లోని వివిధ కుల సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో నాయకులు హనుమంతు ముదిరాజ్, శ్రీకాంత్, సత్యనారాయణ, శ్రీనివాస్, కోట్ల నిరంజన్‌రెడ్డి, జనార్ధన్, హరినాథ్, సదానంద్ పాల్గొన్నారు.

రాజకీయ నేతలతో డీసీ సమావేశం


వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న దశరథ్

సికింద్రాబాద్: అసౌకర్యంగా ఉన్న పోలింగ్ స్టేషన్ భవనాల మార్పులకు ప్రతిపాదనలు పంపించడం జరుగుతుందని ఈఆర్వో, సికింద్రాబాద్ సర్కిల్ డీసీ దశరథ్ తెలిపారు. సోమవారం సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్కిల్ పరిధిలో సౌకర్యాలు లేని పోలింగ్ స్టేషన్ల భవనాలను గుర్తించి వాటి మార్పులకు ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. వీబీపీ ఓటర్ వివరాలు కూడా తెలుసుకొని, వారు ఓటర్ లిస్టులో ఉన్నారా లేదా అనేది సరిచూసుకుని వారి పేర్లు ఉండేలా సహకారం అందించాలని కోరారు. కొత్తగా ఓటర్ నమోదు చేసుకున్న వారి వివరాలతో పాటు పలు అభ్యంతరాలు ఉన్న ఓటర్ కార్డు వివరాలను కూడా అందజేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఈఆర్వో హేమలత, సెక్షన్ ఇన్‌చార్జి భుజేందర్ బాబు, నేతలు రాజ సుందర్, జలంధర్‌రెడ్డి, ప్రకాష్, నర్సింగ్ రావు, కరుణాకర్ పాల్గొన్నారు.